# మునగ చెట్టు

"ముదనష్టపు మునగచెట్టు గాదు గాని వెధవది రోజుకి నలభై సార్లు వూడవ లేక నేను ఛస్తున్నా, దిక్కు మాలిన కొంప, పాడు సొద, ఈ కొంపయినా మార్చరు."

వాకిలి పూడ్చుగుంటూ విసుక్కుంది రాజయ్య భార్య పార్వతి.

రాజయ్య పైమీద తుండుగుడ్డ వేసుకుని గుమ్మందిగుతూ "నిత్యమూ వున్నదేగా, ఎన్నిసార్లనుకుంటే ఏంలాభం? కష్టనష్టాలు మనవీ, ఫలితం వాళ్ళదీను..." అనుకుంటూ వీధిలోకి వెళ్లిపోయేడు.

నిజమే పొరుగింటి మునగచెట్టు చిరుగాలికి కూడా పండుటాకూ, ఎండుటాకూ, జలజలా రాజయ్య యింట రాలుస్తుంది.

అది పూత పూసి, కాపుకాసిన కాలంలో కనీసం మచ్చుకి చారులో వేసుకుందామన్నా ఒక్క కాయ అయినా పార్వతికి దక్కదు.

ఒక్క నడ్డిసలుపు మాత్రం మిగులుతుంది. ఆ మాటకొస్తే సామాన్య సంసారులు గాని సామంతులు కారుగా రాజయ్య, పార్వతీ దంపతులు. చీపురుకట్టలు మాత్రం యేం, తక్కువవుతాయా?

అయితే ఏమిటి చేయడం? పొరుగింటి మునగచెట్టు మాయింట ఆకురాల్చవద్దంటే మానేస్తుందా? లేదూ...రోజుకింత మేటెడు మునగాకు మాయింట రాలుతున్నది గనక. మాకు రెండు కాయలు ఇవ్వమని అడిగితే యిస్తారా? వాళ్ళు.

అసలు యిరుగు పొరుగుల కివ్వడం దాకా యెందుకు? ఆ యింట్లోనే ఆ చెట్టు సాముదాయకపు పంపిణీ క్రింద వున్నది.

ఉండడానికా చెట్టు పీలగా, ఎండుగా మహాకాస్తే...యాభైయ్యో, వందో కాస్తుందేమోగాని, దాని చుట్టూరా నడిచిన, గ్రంథమెంతైనా వుంది. అందుకే దాన్ని అప్పుడప్పుడు, 'జగడాలమారి' మొదనష్టపుది' అని తిడుతూంటుంది పార్వతి.

ఆ చెట్టుమీద ఉమ్మడి హక్కు, ఒకరిది యిద్దరిదీగాదు, నలుగురిదీ.

ఇదే ఏ పూలమొక్కో, జాజిపందిరో అయితే, కొంతగాక పోతే కొంతయినా, సంరక్షణా, చాకిరీ అవసరమయ్యేదిగాని మునగచెట్టుకి ఒకరు చేయాల్సినదేముంటుంది? కాని దాని ఆకు రాలుగాయినోట తిట్లు వూడినట్లు, అలా రాలుతూనే వుంటుంది.

ఆ యింట అంటే రాజయ్య పొరుగుయిల్లు మునగచెట్టు వున్న ఆయింట్లో నివాసమొక్కటిగాని నాలుగు కుటుంబాలున్నాయి.

నిజానికి అవి యిటీవల యేర్పడవేగాని, ఆ ఇంటి స్వంతందారూ, తండ్రీ అయిన ధనయ్య వుండే రోజుల్లో అదంతా ఏక కుటుంబమే.

అయితే లోకోక్తి వున్నది 'తల్లీదండ్రీ కాలం చేసిన తరవాతే అన్నదమ్ములూ, వాళ్ల ఐకమత్యాలు బయటపడేద'ని.

ధనయ్యకి నలుగురు కొడుకులు, ఒక కూతురు. ధనయ్యకూడా మొదట్నించి యిల్లు వాకిలీ వున్నవాడేంగాదు.

కాయకష్టం చేసి కడుపు పోషించు కొనేవాడే. అయితే ధనయ్య భార్య కనకమ్మ వచ్చేకా సిరి ఘల్లుమంది. ఆమె పొబ్బిడితనమూ, ధనయ్యపొదుపరి తనమూ యివాళ్టికి ఆ పెంకుటింటి రూపంగా నిలబడి వున్నాయి.

ధనయ్య వయస్సులో చెయ్యలేని పనులంటూ వుండేవిగావు. కమ్మరి పని అతగాడి ముఖ్య వ్యాపారం అనిపించేది గాని చాలా మందికి అతగాడు తదితరమైన పనులు, రకరకాలవైనవి చేశాడు. బస్తాలు మెయ్యడం, బండ్లు తోలడం మొదలు మిఠాయి దుకాణం పెట్టడము, దానివెనకనే అంగడి నెలకొల్పడమూ వరకూ ఎన్నో చేసినవాడే.

అలాగే అతగాడు ఆరోగ్యవంతమైన సంతానాన్ని కూడా కన్నాడు.

నాలుగు గదులూ, చిన్న మట్టి పెరడూ వుండే పెంకుటిల్లూ వేసుకున్నాడు.

ధనయ్య మొదటినుంచి, చదువు సంధ్యలు మీద నమ్మకంలేని మనిషి 'కండగలిగితే తిండికలదోయ్' అనేరకం. అంచేత కొడుకులకు కాయకష్టమూ, కులవృత్తులూ నేర్పించినాడు. అలాగని వాళ్ళెవ్వరూ నిశానీదారులుగారు. ఒకే ఎలిమెంటరీ పాఠశాలలో చదివి మరి చదువులేదూ అనిపించినవాళ్లే.

ధనయ్య దేహం చాలించిన తరవాత ఆ గృహం నలుగురి హక్కూ అయ్యింది. అయితే కనకమ్మ వున్నదిగా.

●●●

పెద్దవాడి పెళ్ళాం కొంచెం నోటి దురుసుది అనిపేరు పడ్డది. ఆ మాట పార్వతి కూడా వొప్పుకుంటుంది.

"మునగచెట్టును ముదదనష్టపుది, పాపిష్టిది అనొద్దు. కావాలంటే నీ యింట ఆకురాలకుండా

పందిరో, పాకో వేసుకోవాలి'' అంటూ ఓసారి నిష్కారణంగా 'గంయ్'మని పడ్డదామె...

రెండోవాడి భార్య తిండిబోతుది అంటారు తతిమ్మా యిద్దరు కోడళ్ళూను. ఆమాట ఆమె వొప్పుకున్నా, వొప్పుకోకపోయినా, ఒకే కుండపాక మయినన్నాళ్లూ ఆవిడ పేచీలకు దిగేది.

కనకమ్మ కొడుకుల్లో ఆఖరివాడు మూడు ముక్కలాటలో ప్రసిద్ధికెక్కినవాడు. వాడు పారిందా నాలుగు రూకలు తెస్తాడు. లేదా పైమీద చొక్కాకూడా తెగనమ్ముకుని మరీ యింటికి వస్తాడు.

నాలుగోవాడు బ్రహ్మచారి. రెండెడ్లబండీని కూలీకి తోలుతాడు. ఎద్దులాంటి మనిషి. కోపమొచ్చిందో సంజీవకుడే.

తండ్రి ధనయ్య అదృష్టవంతుడు. గనకనే సంసారం విచ్ఛిన్నమై, కొడుకులు గడుగ్గాయిలయ్యేసరికి స్వర్గం వెలిపోయేడంటుంది కనకమ్మ దుఃఖంతో.

కనకమ్మకి అత్తగారు అన్న పేరు దక్కింది గాని, ఆమె నోరు పూర్తిగా పడిపోయింది.

ఒకతె యిద్దరూ గాదు. ముగ్గరు కోడళ్ళనామె అజ్మాయిషీ చెయ్యలేకపోయింది. అయినా ఒక కుండపాక మయినన్నాళ్లూ, నిత్యమూ భోజనాలవేళ, ఆ యింట ఖూనీలవుతాయన్నంత భయానక, భీభత్సదృశ్యాలు కంటబడేవి.

అమాంతం వాడిసెకఱ్ఱ నొకడుచ్చుకుంటే గొడ్డలినొకడు, రోకలిబండనొకడూ తీసుకుని, కలియబడేవారు. దీనికి పార్శ్వరంగంగా, కోడళ్ళు ముగ్గురూ, జుట్టూ జుట్టూ ముడిపెట్టుకునేవాళ్లు.

కనకమ్మ ప్రాణం నలుగురి మధ్యా నలిగి కడబట్టేది. నలుగురి మధ్యా ఆ ముసలిప్రాణం అల్లాడిపోయేది .

చివరికి ఒకనాడు కనకమ్మ తెగించి కుండలు వేరు చేసింది. ఒకే కొంపలో ఎవరి బ్రతుకు వాళ్ళని బ్రతకమ్మన్నది.

పెళ్ళిగానినాడూ చిన్నవాడూ ఐన నాల్గోవాడికి తాను వుడకబెడతానన్నది.

దాంతో యీ సమస్య తెగిపోయిందనుకుంటే అదిఫక్తు ఆశావాదమే అవుతుంది.

ఇక్కడే మునగచెట్టు ప్రసక్తి వచ్చేది, నిజానికది జటిలమైన సమస్య అయి వూరుకున్నది.

అదివరకు భోజన కాలంలో మాత్రమే రగిలే పోట్లాటలు యిప్పుడు సూర్యుడుదయించి గ్రుంకి పోయేలోపున రెండు మూడుసార్లు సంభవిస్తున్నది.

వసారాలో గులుగు పొయ్యిల మీది వంట సాగుతుంది. భోజనాలు ఎవరి గదుల్లో వాళ్ళు చేస్తారు.

ఐతే మునగ చెట్టుకీ సంగతి తెలియదు. దానికి బొత్తిగా పక్షపాతం లేదు. వసారా అంతటా పండుటాకు ఎండుటాకు ఒకేలాగ రాలుస్తుంది.

నిజానికి దాని వాత్సల్యం కూడా కనకమ్మని బోలినది. కనకమ్మ నలుగురు కొడుకులూ నాలుగు

కళ్ళు ఆమెకి. మునగచెట్టుకు అంతే.

దాని కాయలను నలుగురి కుటంబాలు సరిగ్గానే తింటాయి.

పెద్దకోడలు తన కైవసంలో నున్న మేర, వూడ్చి చూసీ, చూడకుండా రెండో దాని యింటి కేసి నెడుతుంది.

మూడోదికూడా, రెండోదాని యింటికేసే చెత్త పెడితేగాని వూరుకోదు.

రెండో కోడలు సమయం చూసి "రంయ్"మని రోడ్డుమీదికి పరిగెత్తి కేకలు వేస్తుంది!

అన్నదమ్ములు చేతులు కలిసేదాకా రగులుతుందీ తగవు. ఈ లోగా కనకమ్మ చీపురు చేతబుచ్చుగుని, మొత్తం తొక్కునంతటినీ వూడ్చి అవతల పారబోసి, పోరు చల్లార్చి సంధి కుదుర్చుతుంది.

ఈ విధంగా నిత్యమూ ఆ యింటి పోరూ, ఆ యింటి మునగచెట్టూ పోరూ రెండూ పార్వతీ, రాజయ్యలకి, సంకటమయ్యేయి. పార్వతికి మిగిలిందల్లా నడుంనొప్పి, గొంతు తీపు.

అప్పుడప్పుడు అమాంతం ఆ యింట జొరబడి, ఆ మునగచెట్టు నరికి పారేద్దామా అన్నంత మండిపోతుంది రాజయ్యకి.

అయితే అంత సాహసం ప్రాణాలకే ముప్పు.

కనకమ్మ తన కూతురుకి కాస్త దూరం సమ్మంధమే చూసి పొరుగూరు యిచ్చింది. పెళ్ళయిన అయిదారేళ్ళలోను, నూకమ్మ రెండు మూడు పర్యాయాలకంటే ఎక్కువ సార్లు రాలేదు.

కాని, నూకమ్మని కాలం చిన్న చూపు చూసింది. నూకమ్మ భర్తకి చేతబడి చేసేరని నమ్మకం ఏమయితేనేం? చేతబడి ఫలితమో లేక అదేవుడే చిన్నచూపు చూసేడో అతగాడు ఆరు మాసాలు తీసుకుని తీసుకుని మరీ గుటుక్కుమన్నాడు.

నూకమ్మ ఏరంత దుఃఖంతో, మూడేళ్ల పసికూనతో సహా పుట్టింటికి తల్లి పంచకి చేరుకుంది.

కనకమ్మ కన్నీరు మున్నీరుగా విలపించింది. "పాడు దేవుడు యివన్నీ చూడానికేనా ఇన్ని రోజులు భూమ్మీద వుంచింది' అని నిందించుకున్నది.

నూకమ్మకి రెండు గేదెలున్నాయి. సాలీనా అత్తగారింటినించి, బహుకొంచెం రూకల రాబడి వస్తుంది. ఆవిధంగా ఆమె యితరులను యాచించినక్కరలేకుండా తన పొట్ట తాను పోషించుకోగలదు కూడా...

ఐతే నేం ఆడబడుచు అన్నాక ఏ ఆడదానికి పడుతుంది? వదినెలతో సరసాలు ఆడడానికి సదా ఎలా పడుతుంది?

ఒక రెండు మూడు నెలలు 'అయ్యో! పసుపూ కుంకుమా నిండుకున్నాదే' అని. సానుభూతితో చూసేరుగాని ఆ తర్వాత మామూలు రగడా-జగడమూ ఆరంభమయ్యింది.

అందుచేత తాను కానీ దమ్మిడీ వొంతున దాచుకున్న నాలుగొందలూ తీసి మునగచెట్టు ప్రక్కన వున్న సందులోని భాగాన్ని కొనజూసింది.

నూకమ్మ వుద్దేశం, కాలక్రమేణా అక్కడోపాక దింపుకుని అందులో కాలం వెళ్లబుచ్చుదామని... తన కొడుకు పెద్దాడై వాడి రెక్కల మీద వాడు నిలబడేదాకా, వాడిని పెంచే పూచీ తనదికదా?

తలకొక వందా యిప్పించి, కొడుకులు నలుగురిచేతా వొప్పించింది కనకమ్మ. వాళ్ళ కదేమీ కష్టమనిపించలేదు. అప్పచెల్లెలు విధవయినందున యింక నెలాగు తమ పంచనుండవల్సిందే. దూరమాలోచించితే దాని గుడిసె దానికి అంటూ వుండడమే మేలని తోచింది. పైగా వందేసి రూపాయలు, దవ్వభిళ్లల్లాగ చేతబడుతున్నవాయిరి.

తోడికోడళ్లూ ముగ్గురూ, అసాధారమైన ఐక్యమత్యంతో యీ విషయంలో చాలా జోక్యం కలిగించుకున్నారు.

మునగచెట్టును మినహాయించమన్నారు. జాగా మాత్రమే అమ్ముకున్నాం. చెట్టు ఫలసాయం మాదే నన్నారు.

కనకమ్మ ఏమనగలుగుతుంది?

నూకమ్మ ఏం చేయగలుగుతుంది?

వేసం కాలం వచ్చింది నిప్పులు చెరుగుతూ. ఒక వంక గేదెలు వొట్టిపోయేయి. మరొక వంక గడ్డీ గాదరా ప్రియమైపోయాయి!

చారు కాచుకుందామని నూకమ్మ రెండు మునగ కాయలు కర్రతో పొడిచి రాల్చింది.

అది తొలుత రెండో కోడలు కంటబడింది. "అయ్యో! అయ్యో! కొంపదోచేసిందో, చెట్టు కూల్చేసిందో"నని ఆమె పెంకులెగిరిపోయేటట్టు అరిచింది.

అసలు చెట్టు మునక్కాడలు తోడికోడళ్లల్లోనే యే వొక్కరూ, మిగతా యిద్దరూ సమక్షంలో లేనిదే కోసుకోకూడదు. అన్న నియమం వున్నది.

అటువంటిది నూకమ్మ, చెప్ప చెయ్యకుండా, అడగా పెట్టకుండా ముందస్తుగా కోసుకోడమా? ఇవాళ ఇదవుతుంది, రేపు మరోటి అవుతుంది.

"చెట్టంతా దులిపేసిందో, కనీసం పిందకూడా మిగిల్చేటట్లు లేదో" నంటూ పోట్లాటకి దిగేరు. కూతురూ, కనకమ్మా ఒక పక్షమూ, కోడళ్లు ముగ్గురూ, ఒక పక్షంగా పోట్లాట జరిగింది.

ఇంటి యజమానులు గూడా రావటంతో పోరు, పరాకాష్ట నందుకుని రంథి నాలుగు వీధుల ప్రాకింది.

'నా జాగాలో వున్నది మునగచెట్టు. నేను నరకేస్తా. మీ దిక్కున్న చోట చెప్పుకో' మన్నది నూకమ్మ.

"గుండెలుంటే నరుకు...నీ గేదెలు రెండింటినీ పేగులు చీల్చకపోతే. నా మొగుడ్ని వదులుకుని

పుట్టింటికిపోతా''నంది రెండో కోడలు.

కాయలమీద ఆడకూతురు నూకమ్మకి యింత పిసరు హక్కు లేదనీ, దాని కాయలు అమ్మినా, కోసినా, ఏం చేసినా, కుటుంబం లోని నలుగురన్నదమ్ములూ కలిసి చెయ్యాలనే నిర్ణయం మీద పోరు చల్లారింది.

పార్వతీ రాజయ్య దంపతులు తగవునైతే తమాషాగా చిత్తగించేరు కాని, దానివల్ల వాళ్ళకి రాగల లాభం ఏం లేదుగనక, లోలోపల క్రుంగిపోయేరు. పొరుగుపోరు యిరుగుకి సంకటమయ్యింది.

ఒకటే, ఈ కొంపయినా మార్చేస్తాను; లేదో, అర్ధరాత్రివేళ ఆ చెట్టునైనా నరికేస్తా''నంటూ ప్రతిజ్ఞ చేసాడు...రాజయ్య, భార్య పార్వతి చెవిలో రహస్యంగా.

అన్నాడేగాని రాజయ్య మలివారం తిరిగి వచ్చినా, ఏ వొక్కపని చేయలేకపోయాడు.

ఈలోగా మునగచెట్టు రంధి, తిన్నగా గాక, తదితరమైన నిత్యకృత్యాలలో రకరకాలుగా కాకి మీదనీ, పిచ్చుకమీదనీ పెట్టి తిట్టుకోడం దాకా వచ్చింది.

ఒకనాటి వుదయం, "నడుంపడిపోతున్నది బాబూ!" అని పార్వతమ్మ తిట్టుగంటున్న వేళ, పనిలోకి వెళుతూవున్న రాజయ్య అనుకున్నాడు.

'ఇవాళ ముసురుసాగేటట్లుంది! ఈ మునగాకు చెత్త యిక తడిసి మోపెడవుతుంది. ఈ రోజు ఎలాగయినా దీన్ని హతమార్చాలి."

నిజంగా, ఆ రోజు సాయం కాలమయ్యేసరికి తుపంర వానై, వర్షంతోపాటు గాలి కూడా రివ్వున సాగింది.

జనమంతా తుఫాను చెలరేగ గలదని హడలిపోయేరు. పెంకుటింటివాళ్ళందరూ వున్నది వెచ్చగా తిని, తలుపులు బిడాయించుకున్నారు. అవతల తుఫాను ఉధృత మెట్లావుందని తొంగికూడా చూడకుండా హాయిగా పడుకున్నారు.

పార్వతీ రాజయ్య దంపతులకి మాత్రం నిద్రపట్టలేదు.

ఒక వంక, గాలి ఉధృతానికి తలుపులు విరిగి పడాతాయన్న బెంగా, మరొకవంక మునగచెట్టును యీ అదనుచూసుకొని నరికేద్దామన్న తహతహ.

తెల్లవారుఝామయ్యే లోపున, తలుపు తెరుద్దామనుకొని, గాలి తాకిడికి జడిసి వూరుకున్నాడు రాజయ్య.

కాని యిక వుండబట్టక తెల్లారబోతోందనగా, తెగువ జేసి రాజయ్య యివతలికి వచ్చేడు. గొడ్డలి వొకటి చేతబచ్చుకున్నాడు. గాలివానకాస్త తెరిపిచ్చింది. మునగచెట్టెంత? ఒక్క వేటు. ధైర్యమే ఉండాలి! కాని పొరుగింట మునగచెట్టు లేదు. రాజయ్య కళ్ళు నులుముకున్నాడు.

మొదట ఆశ్చర్యం, ఆనక ఆనందం కలిగేయి!!!

ఆహా! ముదనష్టపు మునగచెట్టు కూలిందే...అంటూ ఇంట్లోకి పరిగెత్తబోయి గుమ్మం దగ్గర చెట్టుకూలిపోయిందోచ్ ! అంటూ జారిపడ్డాడు.

"అయయ్యో! నా మగడో నా దేవుఁడో! నంటూ పార్వతమ్మ ఇంట్లోనుంచి వస్తూ గుండెలు బాదుకుంది.

రాజయ్య లేచి రెండుమూడు సార్లు కాలుఝాడించేడు

"బెణికిందేమోలో..."నని లేచేడు...మునగచెట్టు సమసిందన్న సంతోషంలో అతగాడి కదీ అంతగా బాధించలేదు.

అయితే, గాలి వాన తగ్గి, కాస్త తూరుపు దిక్కున వెలుతురు విరిగే సరికి, కనకమ్మ యింట గాలివాన చెలరేగింది!

"నీ వుసురేనంటే" అంటే నీ పాపిష్టి కళ్లే... నిక్షేపంలాంటి మునగచెట్టుని పొట్టన బెట్టుకున్నా"యని మెటికలు విరుచుకుని, గుండెలు బాదుకునీ యింటిల్లిపాదీ పోట్లాడుకున్నారు.

ఎన్నాళ్ళు పోట్లాడుకుంటారు? మునగచెట్టు మరి బ్రతకదు కదా! పిట్టపోరు పిట్టపోరు పిల్లితీర్చిందట!

మునగచెట్టు పడిపోయినందుకు, నూకమ్మ సంగతి అటుంచి, రాజయ్యా, పార్వతీ దంపతులతో పాటు యింకెవ్వరైనా సంతసించిన వాళ్లుంటే ఆ వ్యక్తి కనకమ్మమాత్రమే!

**(1960 ఆంధ్రపత్రిక వారపత్రిక)**